లెనిన్‌గ్రాడ్ మవజనవీరులు

రచన :
వి. ఇవనోవ్

CI

లెనిన్‌గ్రాడ్
యువజనవీరులు

అనువాదం
యస్. వి. యస్. ప్రసాదరావు

ప్రజాశక్తి కార్యాలయం
గవర్నరుపేట : : బెజవాడ

ప్రజాశక్తి ప్రచురణ: 40
డిశంబరు 1943

మూ డ ణా లు

ప్రజాశక్తి ప్రెస్
బెజవాడ

తొలిపలుకు

1941 జూన్ 22వ తేదీన జర్మను ఫేసిస్టుమూకలు సోవియట్ రష్యాపై దాడిసల్పినది మొదలుగా సోవియట్ ప్రజలు ఫాసిస్టు విధ్వంసంకోసం అనంతమైన త్యాగాలుచేస్తూ, నిరుపమానమైన ధైర్యసాహసాలను ప్రదర్శిస్తూ స్వాతంత్ర్య యుద్ధం సల్పుతున్నారు. ఫాసిస్టు వ్యతిరేక ప్రజాపోరాటంలో సోవియట్ యువజనులు గౌరవనీయమైన పాత్రను నిర్వహిస్తూ, అత్యంతప్రాముఖ్యమైన బాధ్యతను నెరవేరుస్తున్నారు. మాతృదేశ రక్షణకోసం, ప్రపంచ కష్టజీవుల విముక్తికోసం సోవియట్ యువతీ యువకులు ప్రదర్శించే ధైర్యసాహసాలనుచూచి, రెడ్ఆర్మీ సైనికులు, సోవియట్ రష్యన్ ప్రజలందరూకూడా గర్వపడుతున్నారు.

సోవియట్ ప్రజల విప్లవ సాంప్రదాయాలకు తగినట్లుగా సోవియట్ యువతీ యువకులు, ఫాసిస్టు విధ్వంసంకోసం, శత్రుసేనలను ఎదిరిస్తూ, చీల్చిచెండాడుతూ ఈ పవిత్ర యుద్ధంలో తాము నెరవేరుస్తున్న పవిత్ర ఆశయాన్ని గ్రహించారు. ఇరవైఅయిదు సంవత్సరాలక్రితం తమ తల్లిదండ్రులు, నిరంకుశ ప్రభుత్వాన్ని నాశనంచేసి, అనంతమైన త్యాగంద్వారా అక్టోబరు విప్లవ ఫలితంగా, స్టాలిన్ కాన్స్టిట్యూషన్ ననుసరించి వినూత్నకాంతులతో విరాజిల్లే ఒక నూతన సమాజాన్ని స్థాపించారనికూడా సోవియట్ యువతీ యువకులకు పూర్తిగా తెలుసు.

యుద్ధానికిపూర్వమే పైశాచికఫాసిస్టులు తమదేశ ప్రజలను దోచుకోవాలని చూస్తున్నారనీ, తమ స్వాతంత్ర్యాన్ని హరింపజూస్తున్నారనీ, తమ భాషను, విజ్ఞానాన్ని నాశనంచేయ చూస్తున్నారనీ, తాము సాధించిన విజయాలను ధ్వంసంచేయ చూస్తున్నారనీ సోవియట్ యువకులు గ్రహించారు. (యుద్ధానుభవం దీనినే ఋజువు పరచింది) సోవియట్ ప్రభుత్వం లేకపోతే తమకు నిజమైన స్వాతంత్ర్యం, సభ్యత, సౌఖ్యంలేవనీ, జీవితమే దుర్లభమనీ వారెరుగుదురు.

ఈ మానసికవికాసమే, సోవియట్ యువకుల ధైర్యసాహసాలకు, విజయం తమదేననే అచంచల విశ్వాసానికి మూలాధారం.

ఈ చిన్ని పుస్తకంలో సోవియట్ యువజనులలో ఒకభాగమైన లెనిన్‌గ్రాడ్ నగర వీరయువజనులు నగరరక్షణకోసం, జరిపిన వీరోచిత పోరాటాన్ని వీరోచిత పోరాటాన్ని, వీరోచిత సంఘటనలను నిరూపిస్తాను.

యుద్ధ ప్రారంభానికి మూడునెలలతర్వాత లెనిన్‌గ్రాడ్ నగరం నాజీలచేత ముట్టడింపబడింది. నాజీ వైమానికులు నగరంలోని, ఫ్యాక్టరీలను, గ్రంథాలయాలను, సుందరప్రదేశాలను, నాట్యమందిరాలను, వైద్యాలయాలను, పురాతన శిల్ప కళా ప్రాభవాన్ని తమలో మూర్తీభవింపజేసుకున్న కట్టడాలను, నిరంతర బాంబుల వర్షానికి గురిచేశారు. పసిపాపలమీద, సామాన్యపౌరులమీద మంటల బాంబుల్ని, టార్పెడోదాంబులను విసిరారు. మరతుపాకులను ప్రయోగించారు. సామాన్య పౌరులను హతమార్చేనిమిత్తం జర్మన్ ఫిరంగిదళం ప్రతిరోజు ఫిరంగులను ప్రయోగించింది. కాని లెనిన్‌గ్రాడ్ అచంచలమై నిలిచింది. ఫిరంగిదళాల ఫిరంగి కాల్పులుగాని, వైమానికుల బాంబులవర్షంగాని లెనిన్‌గ్రాడ్ పౌరుల, సోవియట్ దేశభక్తుల మనోనిగ్రహాన్ని చీకాకుపరచలేకపోయినాయి. లెనిన్‌గ్రాడ్‌వీరులు అత్యంత త్యాగభూయిష్టమైన అగ్నిపరీక్షను నిల్చి జయప్రదంగా నగరరక్షణను జరుపగల్గారు. ఈ పరీక్ష యువజనులలో నూతనోత్సాహోద్రేకాలను రేకెత్తించింది.

నిరంతరం ప్రమాదంతోకూడిన దినాలు, నిద్రాహారాలు లేనిరాత్రులు, రక్తరంజితమైన కార్మికయుద్ధాలు - యిదే నేటి లెనిన్‌గ్రాడ్ జీవితం. కాని ఈ విషమ పరీక్షాకాలం గడిచిపోయి, ఫేసిస్టురాక్షసులు పరిమార్చబడినప్పుడు సోవియటు దేశభక్తుడు "1941 - 42 లో నేను లెనిన్ నామాంకిత పవిత్రనగరాన్ని సంరక్షించాను" అని ఎంతో సగర్వంగా చెప్పుకొంటాడు!

1

పిలుపు

లెనిన్‌గ్రాడ్ నగరంపై నాజీలు తుపాకులుకాల్చిన మొదటిశబ్దం వినబడగానే అగ్నిమాపకదళం (Fire Brigade)లోని యువకసభ్యుడు "మైకేల్ కొర్బకోవ్" వెంటనే తనజిల్లా సైనికకార్యాలయానికివెళ్లి, తాను రణరంగానికి వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నాననీ, తనను వెంటనే యుద్ధరంగానికి పంపమనీ జిల్లాఅధికారిని కోరాడు. ఆ అధికారి "నీవెందుకు యుద్ధరంగానికి వెళ్ళాలనికోరుతున్నావు? మంటలనార్పే కార్యక్రమంకూడా నగర రక్షణకు సంబంధించినదే గదా" అని ప్రశ్నించాడు. "అదినిజమే" నంటూ ఒకచిన్న కాగితంమీద తనతల్లి తనకు వ్రాసిన ఒక ఉత్తరాన్ని ఆ అధికారికిచ్చాడు.

అందులో ఇలాఉంది. "ప్రియమైనమీషా! నేను నీతల్లిగా ఈ ఉత్తరాన్ని వ్రాస్తున్నాను. కర్కశహృదయుడైన శత్రువు మన దేశంపై బడ్డాడు. ఆ శత్రువు నెదిరించుటకుగాను, నీసోదరులు యుద్ధరంగానికి వెళ్ళారు. నాముగ్గురు పుత్రులూ ఫాసిస్టులను నాశనం చేయడానికి యుద్ధరంగంలో నిలబడాలని కోరుతున్నాను..... మీరు దేశాన్ని కాపాడండి! మీలాంటి పుత్రులను కన్నందుకు దేశం నన్నభినందించుకుంది.... వెళ్ళునాయనా.... యుద్ధరంగానికివెళ్ళు.... వీరునివలె పోరాడు.... నేను యుద్ధానంతరం....విజయంతోపాటు నీరాకకై ఎదురుచూస్తుంటాను........".

ఆ అధికారి ఈ యువకుని దరఖాస్తును అంగీకరించాడు. కొలదిరోజుల్లోనే "కొర్బకోవ్" ఒక వాలంటీర్‌గా యుద్ధరంగానికివెళ్ళాడు. ఇది లెనిన్‌గ్రాడ్‌లోని ఒక యువకవీరుని గాథమాత్రమే. యుద్ధపు తొలిరోజుల్లోనే వేనవేల యువకులు పెద్దపెద్ద పరిశ్రమలలో పనిచేసేవారితో సహా తమంతటతాము రెడ్‌ఆర్మీలోచేరి యుద్ధ సన్నద్ధులయ్యారు.

"ఇజ్‌హోర్‌స్కీ" పరిశ్రమలో పనిచేసే కుటుంబాలకు కుటుంబాలే సైన్యంలో చేరినాయి. ఇందుకు "యురేవ్" అనే కుటుంబమే నిదర్శనం. మొదట "గియోర్గీ యురేవ్" సైన్యంలోచేరాడు. వెంటనే అతని చెల్లెలు "ల్యోల్యా", తర్వాత అతని చిన్నచెల్లెలు "అన్నా" రెడ్‌క్రాస్ నర్సులుగా శిక్షణపొందటానికి యుద్ధంలోచేరారు.

లెనిన్‌గ్రాడ్ విద్యార్థులు పుస్తకాల నవతలపెట్టి తుపాకులు చేతబట్టారు. లెనిన్‌గ్రాడ్‌లోని ఒక విద్యాసంస్థలో ఒక ప్రత్యేక మిలిటరీదళమే తయారయింది. విద్యార్థులు, ఉపాధ్యాయులుకూడా ఇందులోచేరారు. చాలమంది విద్యార్థులు మిలిటరీ శిక్షణతోబాటు, మామూలు విద్యనుకూడా అభ్యసించసాగారు. "అలెక్సీ హెన్‌కిన్" అనే, లెనిన్‌గ్రాడ్ విశ్వవిద్యాలయంలో చరిత్ర నభ్యసించే విద్యార్థి పట్టభద్రుడు కావటానికి చదువుతున్నాడు. యుద్ధం ప్రారంభంకాగానే అతని కార్యక్రమం తలక్రిందులయింది. అయినా ఒక నెలరోజులు చురుకుగా చదివి చివరి పరీక్షలో మంచిమార్కులతో ప్యాసయ్యాడు. తర్వాత సైన్యంలో చేరాడు.

"లెస్‌గాఫ్ట్" శారీరక శిక్షణకేంద్రంలోని విద్యార్థులంతా రెడ్‌ఆర్మీలోచేరి యుద్ధరంగానికి వెళ్లారు.

యుద్ధరంగంలో వీరవిహారం

యంత్రాలయాలను వదిలిపెట్టి యుద్ధరంగానికి వెళ్లిన యువకులూ, విద్యా సంస్థలను వదలి యుద్ధసన్నద్ధులైన విద్యార్థులూ, నగర రక్షణకోసం జరిపే పోరాటంలో తమ శక్తిసామర్థ్యాలను రుజువుచేసుకున్నారు. ఈక్రింది సంఘటనలే యువకులు ప్రదర్శించే ధైర్యసాహసాలకు, చేసే వీరవిహారానికి నిదర్శనం.

పదకొండుమంది యువకులు ఒక రైఫిల్‌దళంగా ఏర్పడ్డారు. "పాషిన్" అనే ఒక యువకసార్జంటు నాయకత్వంక్రింద నగరపరిసరాలలో శత్రువు నెదిరించటానికి బయలుదేరారు. ఒక క్రొత్తస్థానాన్ని ముట్టడించి ముందుకు సాగుతున్నారు. జర్మన్లు అదేస్థానంకోసం ఎదురుముట్టడి ప్రారంభించారు. అసంఖ్యాకములుగా టాంకులు, మరతుపాకులను ధరించిన సైనికులతో ఈవీరులను ఎదుర్కొన్నాయి. వెంటనే "పాషిన్" తన 11 మందిని ఈవిధంగా హెచ్చరించాడు.

"కామ్రేడ్స్! మనవెనుక మననాయకుడు లెనిన్ నామాంకితమైన లెనిన్‌గ్రాడ్ ఉంది. మన నగరానికి మనం కళంకాన్ని ఆపాదించకూడదు. ఒక అడుగు కూడా వెనక్కి వెయ్యొద్దు."

వెంటనే ఆ పదకొండుమంది "ఒక అడుగుకూడా వెనక్కి వెయ్యం" అని సమాధానం యిచ్చారు.

టాంకులు బాగా దగ్గరకు వచ్చాయి.

"కాల్చండి" అని పాషిన్ ఆజ్ఞనిచ్చాడు.

శత్రువుల టాంకుదళంపై చేతిబాంబులు, ద్రావకాలున్న సీసాలు, విధివిరామం లేకుండా ప్రయోగిస్తున్నారాయువకులు. ముందు దారితీసే టాంకు ఆగిపోయింది. అందులోనుంచి మంటలు లేచాయి. తుపాకులను కాల్చటం మొదలు పెట్టారు జర్మన్లు.

నగరరక్షణకు పూనుకున్న ఈపదకొండుమంది యువకులు, శత్రుసేనలపై చిందరవందరగా తుపాకిగుండ్ల వర్షాన్ని కురిపించారు. ఒక అడుగుకూడా ముందుకు వేయలేకపోయారు జర్మన్లు. జర్మన్లలో చాలామంది మంచులో కూరుకుపోయారు.

జర్మన్లప్పుడు మరతుపాకులను ప్రయోగించారు. "రొగదోవ్" అనే యువకుడు మరణించాడు. కాని అతని సహచరులు, తుపాకులను కాలుస్తూనే ఉన్నారు. ఒక జర్మన్‌టాంకు మండటం ప్రారంభించింది. ఇంకా అనేకటాంకుల కవచాలను దూసుకుంటూ పోయినాయి ఈ యువకుల తుపాకిగుండ్లు. టాంకులను నాశనంచేశాయి.

"పాషిన్" తన పదకొండుమంది అనుచరులతోను కాపాడుతూన్న స్థానం చుట్టూ జర్మన్ల శవాలు గుట్టలు గుట్టలుగా పడ్డాయి. కాని ఒకరితర్వాత ఒకరు ఈ వీరులుకూడా పడిపోయారు. తమ జీవితాల్ని, మహత్తరమైన ఆశయంకోసం

త్యాగం చేశారు. ధన్యజీవులు, ఈ అసమానపోరాటం చాలాకాలం జరిగింది. కాని వీరిమరణం వృధాకాలేదు.

చివరకు సార్జంటు "పాషిన్" ఒక్కడే మిగిలాడు. గాయపడినప్పటికీ శతృవులపై తుపాకిని ప్రయోగిస్తూనేఉన్నాడు. అతనిమందు అయిపోయింది. ఒక చేతిబాంబును విసిరేనిమిత్తం లేవబోయాడు. ఆ సమయంలో ఒక గుండువచ్చి అతని హృదయానికి తగిలింది. సార్జంటు "పాషిన్" నేలకొరిగాడు.

పదకొండుమంది నేలకొరిగారు. కాని వారు తమ ఆజ్ఞలను పాలించారు. వారు తమ స్థానాన్ని శతృవుకు వశంకాకుండా నిల్పుకోగల్గారు. ఇంత పట్టుదలలో ఈ యువకులు, శత్రువుల నెదుర్కొనేసరికి, వీరివెనక ఎంతబలం ఉన్నదోనని నాజీలు వెనక్కుతగ్గారు. తిరోగమించారు.

అదే సమయంలో, సోవియట్ సైన్యాలా స్థానాన్ని చేరాయి. "పాషిన్ అనుచరుల" (లెనిన్‌గ్రాడ్‌లో ఈ యోధులను ఇపుడు అలా పిలుస్తున్నారు.) మృత్యుధిక్కారశౌర్య ఫలితంగా, ఆ స్థానం సోవియటుచేతిలోనే ఉండిపోయింది.

• • • •

మరో సంఘటనను చూడండి.

యుద్ధరంగంలో ఒకభాగంలో రష్యన్ సైనికుల కళ్ళబడకుండా ఒక జర్మన్ ముఠా లోపలికి ప్రవేశించి కొంతదూరం మెల్లగా నేలమీదప్రాకి "లజరోవ్" అనే యువకుడు కాపాడుతున్న స్థానాన్ని ముట్టడించింది. ఒండొరులపై తుపాకులను విపరీతంగా కాల్పుకోవడం ప్రారంభించారు. ఒక జర్మన్ సైనికుడు వెనుకనుండి అకస్మాత్తుగా "లజరోవ్" మీదపడి ఆయుధాలులేకుండా జేశాడు. జర్మన్లు అతని చేతులు కట్టివేసి బయనట్లను గురిచేసి "లజరోవ్"ను జర్మన్ సైనిక కార్యాలయానికి తీసుకువెళ్లారు. వారంతా ఒక వనమార్గానికి వచ్చారు. దానిని "లజరోవ్" గుర్తించాడు. అతడదివరకు ఇక్కడ ఉన్నాడు. ఆ ప్రదేశం ఇదివరకే మందు గనులతో నిండియున్నదని లజరోవ్‌కు తెలుసు. "లజరోవ్" తన ప్రాణంపై తీపైనాలేకుండా ఆ జర్మన్లందరినీ నాశనంచేయాలని నిశ్చయించుకున్నాడు. తాను నడవగల్గినంతవరకు కుడిప్రక్కగా నడవటం ప్రారంభించాడు. వాళ్ళందరినీ ఆ మందుగని ఉన్నచోటుకు తిన్నగా తీసుకురావాలని అతని అభిప్రాయం. అతని ప్రాణంకూడా ఆగని ప్రేలగానే పోతుందని అతనికి పూర్తిగా తెలుసు.

అయితేమాత్రం ఏం? అతని ప్రాణాన్ని 15 మంది జర్మన్లను నాశనం చేయడానికి త్యాగం చేస్తున్నాడు. ఈ మనఃప్రవృత్తిలోనే "లజరోవ్" ముందుకు సాగాడు.

అకస్మాత్తుగా ఒక జర్మన్‌సైనికుడు మందుగనిపై నడిచాడు. వెంటనే బ్రహ్మాండమైన ధ్వనితో ఆగని ప్రేలింది. చాలమంది జర్మన్లు ఆమంటల్లో పడి పోయారు. మిగతా మందుగనులుకూడా యిందువల్ల ప్రేలినాయి.

"లజకోవ్" కూడా నేలకొరిగాడు స్పృహ తప్పిపోయి. తిరిగి ఆరాత్రికి, స్పృహవచ్చింది. జర్మన్ల శవాలు అతనిచుట్టూ పడివున్నాయి. అతనుకూడా తీవ్రంగా గాయపడ్డాడు. అమితంగా బాధపడుతూ, రక్తస్రావంవలన నిస్సత్తువగా వున్నప్పటికీ నేలమీద నెమ్మదిగా ప్రాకుతూ, చివరకు, అతని సైనికదళాన్ని, చేరుకోగలిగాడు.

ఒక లెనిన్‌గ్రాడ్ యువకసైనికుడు జర్మన్లచేత ముట్టడింపబడినపుడు మరో విచిత్ర సంఘటన జరిగింది. అది మరతుపాకీదళానికి చెందిన "పెట్రెసోవ్" కు సంబంధించింది. యిరుపక్షాలవారు ఒకరంగంలో తలపడినప్పుడు అతడొక జర్మన్ దళం అంతటి తుపాకిగుండ్లకు గురికావలసివచ్చింది. ఎటుజూచినా జర్మన్లే కన బడుతున్నారు. కాని "పెట్రెసోవ్" నిఘంటువులో లొంగిపోవడమనేది లేనేలేదు.

జర్మన్లు అతనిమీద చేతిబాంబులను ప్రయోగించటం ప్రారంభించారు. ఆ బాంబులు అతనికి కొంత దూరానే పడటం మూలంగా మంచుపైకెగిరి అతనిని పూర్తిగా కప్పివేసింది. అతని తుపాకి, అతనుకూడా మంచులో మునిగిపోయాడు. ఆ మంచును ఒకప్రక్కకు తోసుకుంటూ కాల్చటం ప్రారంభించాడు "పెట్రెసోవ్". జర్మన్లుకూడా కాలుస్తున్నారు. "పెట్రెసోవ్" కు అనేకసార్లు చిన్నచిన్న దెబ్బలు తగిలాయి. కాని అతను ఒక్క అడుగుకూడా వెనక్కివేయలేదు. ఆసమయంలో జర్మన్ మోర్టారుగుండ్లు ప్రేలినధ్వని వినబడింది. ఒకటి "పెట్రెసోవ్" కు సమీపంగా ప్రేలి అతని రెండుపాదాలను ఎగరగొట్టింది. కాని ఈ వీరుడు తనశక్తి సన్నగిలిపోతున్నదని తెలిసినప్పటికీ, తనవద్దనున్న ఆఖరుగుండు అయిపోయే వరకు జర్మన్లపై తన మరతుపాకీని ప్రయోగిస్తూనేవున్నాడు. జర్మన్లకు అతనిని సమీపించటానికి దమ్ములేకపోయింది. ఈ యువకుడు, రక్తం స్రవిస్తూ మరణావస్థలోనున్నసంగతి జర్మన్లకు తెలియదు. "పెట్రెసోవ్" తన మరతుపాకీనికూడా ఈడ్చుకుంటూ, మెల్లమెల్లగా ప్రాకుతూ తన సైనికదళాన్ని చేరుకోగలిగాడు. అక్కడ ఒక కామ్రేడ్ "నువ్వు ఒంటరిగావున్నావుకదా, పెందలాడే ఎందుకు రాలేకపోయావు" అని ప్రశ్నించాడు. వెంటనే "పెట్రెసోవ్" తడుముకోకుండా "అది నిజమే కాని ఒకరంగంలో ఒక మనిషైనా ముఖ్యంగా అతనిచేతిలో ఒక మరతుపాకీ వున్నప్పుడు "అతడొక సైనికదళంతో సమానం" అని సమాధాన మిచ్చాడు.

"అవును—తుపాకియేగాదు. మంచి గుండెకూడావుంటే" అని కలిపాడు ఆ కామ్రేడ్.

• • • •

లెనిన్‌గ్రాడ్ రంగంలోని సైనికులకు, సైన్యాధిపతులకు, ఎవరికివారే ఎక్కువమంది నాజీలను చంపాలనే, దృఢకాంక్ష. పోటీ ఎక్కువగా కనబడింది. పదులు, ఇరవైలు, చివరకు వందలు చంపినవాళ్లుకూడా ఉన్నారు.

"ఫిదొసీ స్మొల్యేచకోవ్" అనే యువకుడు యుద్ధానికిపూర్వం ఒక వృత్తి పాఠశాలలో పనినేర్చుకునేవాడు. ఆ యువకుడిప్పుడు "సోవియట్ యూనియన్ వీరుడు" (Hero of the Soviet Union) అనే బిరుదును పొందాడు.

కొన్ని సంవత్సరాలకుపూర్వం "ఫెద్కా" (అతని స్నేహితులుపెట్టిన పేరు) బైలోరష్యాలోని, అతని జన్మస్థానమైన ఒక గ్రామంలో గొడ్లకాపరిగా ఉండేవాడు. అతనికి తన గ్రామంలోని పచ్చికబయళ్ళంటే అమితమైన ప్రేమ. లెనిన్‌గ్రాడ్‌లోని, తీర్చిదిద్దిన వీధులను, సుందరభవనాలను, గ్రంథాలయాలను, ఉద్యానవనాలను, చూచి తన జన్మస్థానంలోని పచ్చికబయళ్ళలాగే ఆనందించాడు.

అతనిలో విజ్ఞానపిపాస, పనిచేయాలనే కోర్కె, ఎక్కువగా ఉన్నాయి. యుద్ధం ప్రారంభంకాగానే అతనిస్థానం యుద్ధభూమేనని నిశ్చయించుకున్నాడు. అతనిస్థానం, తనదేశం నాజీహంతకులచేత ముట్టడింపబడినపుడు, లెనిన్‌గ్రాడ్ మహానగరం ప్రమాదభూయిష్టమైనప్పుడు, యుద్ధభూమిలోగాక మరెక్కడ?

అతడు సైన్యంలో చేరదామని ఒక సైనిక కార్యాలయానికి వెళ్ళాడు. కాని అచ్చటి అధికారి "కొంచం పెద్దవాడివయ్యేదాక ఓపికపట్టు" అన్నాడు.

"నేను పెద్దవాడినయ్యాను. నాకు యుద్ధంచెయ్యాలని ఉంది" అని ఫెద్కో పట్టుబట్టాడు.

వాదోపవాదాలు జరిగిన తర్వాత అతనికోర్కె నెరవేరింది. అతడు సైన్యంలో చేరాడు.

అతనిని యుద్ధరంగానికిపంపారు. యుద్ధభూమిలో ఒకవంటశాలలో అతనిని నియోగించారు.

కాని అతడు కోరుకొన్నది ఇదిగాదు. అతనికి కావలసింది ఫాసిస్టులపై తుపాకిని కాల్చడం.

ఒకరోజు "ఫెద్కో" సైన్యాధికారి దగ్గరకువెళ్ళి "నేను గొడ్లకాపరిగా వున్నప్పుడు తోడేళ్ళను వేటాడేవాడిని. నన్నిప్పుడు ఈ హిట్లర్ అనుచరులను - ద్విపాద పశువులైన జర్మన్ సైనికులను వేటాడనియ్యండి" అని అన్నాడు.

అధికారి అంగీకరించాడు. ఆరాత్రే మరికొందరితోపాటు అతనినికూడా పంపారు. "ఫెద్కో" తనసామర్థ్యాన్ని ఋజువుచేసుకున్నాడు. మరునాడా అధికారి "నీవు శక్తివంతుడివి. రాత్రి నీవు ముగ్గురిని చంపావని చెప్పారు" అన్నాడు ఫెద్కోతో.

ఇది 1941 అక్టోబరు 29 నాడు జరిగిన సంఘటన.

ఫాసిస్టులు తన మాతృదేశంలోచేసే అత్యాచారాలకు, హత్యాకాండకు ప్రతిగా అతడు కాల్చినకాల్పులకిదే ప్రారంభం. త్వరలోనే అతనిని గస్తీదళంలో వేశారు. అలా చాలాసార్లు వెళ్ళటం జరిగింది. స్నైపర్ (Sniper) గా అతని ప్రావీణ్యం, కీర్తి, ఆ రంగంలోని సైనికులందరికి పాకింది. "నేను ఫాసిస్టులను అసహ్యించు

కుంటున్నాను" నేను నా కర్తవ్యాన్ని నెరవేరుస్తాను. కామ్రేడ్ స్టాలిన్ హిట్లర్ అనుచరులను చంపండి" అని చెప్పారు. నేను రోజురోజూ, జర్మన్లను రోజురోజూ క్రమేపీ చంపుతాను. ఇది నా ధర్మం. అలా చేస్తానని నేను శపథం చేస్తున్నాను" అన్నాడు ఫెడ్కో.

ప్రతిరోజూ ఎంత విపరీతంగా మంచుకురుస్తున్నప్పటికీ "స్మోల్యకోవ్" తన తెల్లగానువేసుకుని జర్మన్ ఫాసిస్టులను హతమార్చడానికి తన నిర్ణీతస్థలం దగ్గర పొంచి ఉండేవాడు. కన్నులార్పకుండా, చెవులు నిక్కపొడుచుకొని, ధ్యానమంతా కేంద్రీకరించి, అతడు శత్రువులకోసం వేచియుండేవాడు. ఫాసిస్టు కంటపడగానే, తుపాకి మ్రోగటం, అతడు నేలకూలటం పరిపాటయింది. "స్మోల్యకోవ్" చంపిన జర్మన్లసంఖ్య 125 కు చేరింది. 18 సంవత్సరాల "స్మోల్యకోవ్" ఒకప్పటి గొర్రెల కాపరి - ఇంజనీర్ దగ్గర పనివాడు - ఒకప్పుడు సైనిక కేంద్రంలో వంటవాడుగా పనిచేసిన స్మోల్యకోవ్ - "సోవియట్ యూనియన్ వీరుడు" అనే బిరుదును సంపాదించాడు.

"స్మోల్యకోవ్" కీర్తిచంద్రిక లెనిన్‌గ్రాడ్ రంగంలోని సైనికులకేగాక జర్మన్ సైనికులలోకూడా వ్యాపించింది. "స్మోల్యకోవ్"ను హతమార్చినవారికి పెద్ద బహుమాన మీయబడుతుందని జర్మన్ సైన్యాధికారులు ప్రకటించారు. జర్మన్లు స్మోల్యకోవ్‌ను పట్టుకోవడానికి కొంతమందిని ప్రత్యేకంగా నియమించారు. చాల రోజులవరకు ఈ సోవియట్ వీరుని పట్టుకోలేకపోయారు. కాని ఒకరోజున శత్రువుల తుపాకి గుండొకటి అతని గుండెకు తగిలింది.

స్మోల్యకోవ్ మరణించాడు. కాని అతని పని సాగుతూనేవుంది. వేలకొలది నూతన యువకులు. నాజీలను వేటాడి కక్షసాధిస్తున్నారు.

లెనిన్‌గ్రాడ్ రంగంలోనే "ఫెటెంట్సేవ్" అనేయువకుడు "స్నైపర్"గా ప్రఖ్యాతి గాంచాడు. ఈ యువకుడు మొదట రెడ్ఆర్మీలో ఒక వాలంటీరుగా ప్రవేశించాడు. యుద్ధానికిపూర్వం ఈ యువకుడు "లెనిన్‌గ్రాడ్ మైనింగ్ ఇన్‌స్టిట్యూట్"లో విద్యార్థి. ఈయువకుడు 150 మంది జర్మన్లను చంపాడు. ఇతడు వందమందికిపైగా కొత్తస్నైపర్లను తయారుచేశాడు. ఈ యువకునికికూడా "సోవియట్ యూనియన్ వీరుడు" అనే బిరుదునిచ్చి గౌరవించింది సోవియట్ ప్రభుత్వం.

* * * *

రెడ్‌నేవీ (నౌకాదళం) వీరులంటే నాజీలకు సింహస్వప్నం. శత్రువులకు అపాయాల్ని కల్గించటం రెడ్‌నేవీ వీరులకు ఉగ్గుపాలతో నేర్పినవిద్య. ధైర్యం వారిశక్తి సామర్థ్యాలకు వన్నెతెచ్చే సద్గుణం. రెడ్‌నేవీ వీరులలో "సబ్బోటిన్" అనే దృఢకాయుడైన యువకుని దొక ప్రత్యేకత. నేలమీద జరిగే పోరాటాలలో కూడా రెడ్‌నౌకాదళానికి చెందిన నావికులు పాల్గొంటున్నారనేవిషయం జగద్విదితం.

ఒకరోజున గస్తీకివెళ్ళి తిరిగివచ్చే సమయంలో 20 మంది జర్మన్లు. సోవియట్ కమ్యూనికేషన్లవైపు రావటం, ఆ తీగలను తెగగొట్టటానికి ప్రయత్నించటం "సబ్బోటిన్" చూచాడు. అతనొక్కడే వాళ్ళ నెదిరించటానికి నిశ్చయించుకున్నాడు. జర్మన్లమీద గురిచేసి కాల్చటం ప్రారంభించాడు. గురి తప్పకుండా కొట్టడంవల్ల వెంటనే పదిమంది జర్మన్లు నేలకొరిగారు. "సబ్బోటిన్" తన కార్యాలయం (Head puarters) వారికి ఈ విషయం తెలియపరచేనిమిత్తం టెలిఫోన్ దగ్గరకు ప్రాకుతూపోతూవుండగా ఒక దెబ్బ తగిలింది. మిగిలిన పదిమంది జర్మన్లు విపరీతంగా కాలుస్తున్నప్పటికి టెలిఫోన్ పెట్టెను చేరగల్గాడు. టెలిఫోన్‌లో మాట్లాడే సమయంలో పదమూడుసార్లకు పైగా దెబ్బలు తగిలినాయి. శత్రువులకాల్పులకు ప్రతిగా కాల్పులు కాల్చాడు. జర్మన్లను మరికొంతమందిని చంపాడు. చివరకు తన నిర్ణీతప్రదేశానికి ఎలాగోచేరాడు.

నాజీశ్రేణుల వెనుక

నెత్తురుకాల్వలు, బూడిదచేయబడిన గృహాలే ఫాసిస్టుల పునస్తత్వానికి చిహ్నాలు. ఫాసిస్టులకు, ప్రజల ఇండ్లను తగలబెట్టడం, సామాన్య ప్రజలను చంపడం, ఉరితీయడం, విలాసమయింది. కాని సోవియట్‌ప్రజల ధైర్యం చెక్కు చెదరలేదు. తమ అమానుషకృత్యాలకు జర్మన్లు తగిన శిక్షను అనుభవిస్తున్నారు. ఏవిధంగా సోవియట్ ప్రజలు ప్రతీకారం చేస్తున్నారు? ఏవిధంగా కసిదీర్చుకుంటున్నారు? అనే విషయాలకు నిదర్శనమే ఈ క్రింది దృశ్యం.

ఒకవ్యక్తి, ఒక అరణ్యపు పరిసరాలలో, ఒక రైల్వేలైను ప్రక్కనవున్న పొదలలో పడుకునివున్నాడు. ఆ వ్యక్తి, రైళ్ళ కదలికను, పోయే రైళ్లసంఖ్యను గ్రహిస్తున్నాడు. చివరకు అతనికి కావలసిన భోగట్టాను సంపాదించుకున్నాడు. ఆ వ్యక్తి మెల్లగా, ఆ రైల్వేలైనును కాపాడుతూన్న జర్మన్ గస్తీదళానికి కళ్లల్లో దుమ్ముకొట్టి రైలుపట్టాలమీద, వచ్చే రైలుకు బహుమతిగా ఒక మందుగుండు గనిని ఉంచాడు. తిరిగి తన స్థానంలో దాక్కొన్నాడు. రైలు కనుచూపుమేరలో ఉంది. శరవేగంతో వస్తోంది. అకస్మాత్తుగా మందుగని ప్రేలింది. ఆ వ్యక్తి ఆ అరణ్యంలో మాయమయ్యాడు! అతను తన జేబులోనున్న "నోటుబుక్కు"ను తీసుకుని ఒక టిక్కు పెట్టాడు. "మరొక శత్రుసైనికుల రైలును ధ్వంసంచేశాను" అని వ్రాసుకున్నాడు.

ఈ వ్యక్తి "యస్. ల్యోవా" అనే యువకుడు. ఈ యువకుడు యుద్ధానికి పూర్వం "లెనిన్‌గ్రాడ్ కెమికల్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూటు" విద్యార్థి. నేడు అతడొక గెరిల్లా దళసభ్యుడు - అతని నోటుబుక్కులో 18 టిక్కులు (గుర్తులు) ఉన్నాయి.

ఇది అతడు ధ్వంసంచేసిన శత్రువుల రైళ్ళజాబితా మాత్రమే. ఈ గెరిల్లా యోధుడు అనేక శత్రువుల సామానురైళ్ళను, మందుగుండు సామానుతో నిండి ఉన్న మోటారుట్రక్కులను, శత్రువుల ఆహారపదార్థాల మోటార్లను నాశనం చేశాడు. వేలకొలది లెనిన్‌గ్రాడ్ యువతీయువకులు, గెరిల్లాదళాలలో చేరారు. అరణ్యాంలోకి, మాటుప్రదేశాలలోకి వెళ్ళారు. నాజీ శ్రేణులవెనుక అచంచల విశ్వాసంతోనూ, మృత్యువును ధిక్కరించే సాహసంతోనూ; శత్రువులను చీకాకు పరుస్తున్నారు. ప్రతిరోజూ లెనిన్‌గ్రాడ్ పరిసరాలలోని నాజీ ఆక్రమిత జిల్లాలలోని ప్రాంతాలలో యీ గెరిల్లాయోధులు నాశనంచేసే రైలురోడ్లకు, మందుగుండు సామానులో నిండిఉన్న మోటారుట్రక్కులకు, నేలమట్టంచేసే సాయుధదళాలకు, అంతేలేదు. శత్రు సైనికశ్రేణులవెనుక జరిగే గెరిల్లా పోరాటాలలో లెనిన్‌గ్రాడ్ యువతీయువకులు, నిజమైన వీరులనిపించుకున్నారు. ఈ క్రింద ఈ విషయాన్ని రుజువుచేసే కొన్ని ఉదాహరణలను పొందుపరుస్తున్నాను.

"ల్యోవా" పనిచేస్తున్న ప్రాంతానికి కొద్దిదూరంలోనే ఒక గెరిల్లా దళం పనిచేస్తోంది. ఆ దళంలో "గ్రిగోరీ" అనే యువకుడున్నాడు. యుద్ధ ప్రారంభ సమయానికి అతడొక సెకండరీస్కూలు విద్యార్థి. ఒకనాటి రాత్రి ఒక రైల్వే లైనును నాశనంచేసి, మందుగుండు సామానును తీసుకుపోయే రైలును నాశనం చేశాడు. ఇంకోసారి జర్మన్ సైనికులను తీసుకుపోతున్న ఒకమోటారుట్రక్కును నాశనం చేశాడు. ఈకార్యాలు చేసినందుకు మరికొన్ని శౌర్యకృత్యాలకు అతనికి ఒక పతకము (డిస్టింగ్విష్డ్ సర్వీస్ మెడల్) నిచ్చుటకు సోవియట్ ప్రభుత్వం నిశ్చయించింది.

• • • •

లెనిన్‌గ్రాడ్ పరిసరాలలోనే, గెరిల్లా పోరాటాలలో ప్రఖ్యాతిగాంచిన "అంటోనినాపెట్రోవా" అనే బాలికఉంది. ఆమె యుద్ధానికి పూర్వం లెనిన్‌గ్రాడ్ పరిసరాలలోనున్న "లూగా" అనే పట్టణంలో నివసించేది. ఆమె చాలా బలహీనం గాను, సన్నగాను ఉండి. మితంగా మాట్లాడేది. ఆమెకు పద్యకావ్యాలంటే ఎక్కువ ఇష్టం. కళాశాలలో విద్యాభ్యాసంచేయాలని కలలుగనేది. ఇంతలో యుద్ధం ప్రారంభమయింది. శత్రువు దగ్గఱకొచ్చాడు. ఆగష్టునెలలో లూగా పట్టణ పరిసరాలలో యుద్ధం జరుగుతోంది. ఒకరోజు రాత్రి టోస్యా (ఆ బాలిక ముద్దుపేరు) వీధులలో బారులుతీర్చి సాయుధమోటారుదళాలు పోవటంచూచింది. ఇది 'త్యాగ' వాలంటీర్లదళం. వారు శత్రువుల వెనుకభాగంలో దెబ్బతీయటానికి వెళుతున్నారు. టోస్యా వారిదగ్గరకువెళ్ళి తానుకూడా వస్తానంది. "నీవల్ల ఏమవుతుంది? అడవులలో పోరాడాలి. నువ్విక్కడేవుండు" అని ఆ వాలంటీర్లు సమాధానమిచ్చారు. కాని టోస్యా తనపట్టు విడువలేదు. "సరే. రా. తర్వాత విచారపడతావులే" అన్నారు చివరకు.

టోస్యా వారివెంట వెళ్ళింది.

కొన్నిరోజుల తర్వాత ఆదళం, తనకార్యక్రమాన్ని జయప్రదంగా నెరవేర్చి తిరిగొచ్చింది. ఇప్పుడు టోస్యాఅంటే, వారికిదివరకున్న అభిప్రాయాలు పూర్తిగా మారిపోయాయి. ఆ దళాధిపతి టోస్యాను కొనియాడాడు. ఆ బాలిక చూపిన ఓర్పుకు, ధైర్యానికి మిక్కిలి సంతోషించాడు. అనేక కష్టాలకు గురియైనప్పుడు కూడా ఆమెచూపిన సహనానికి ఆశ్చర్యపడ్డాడు. ఒకసారి తమదళం, చిక్కులో నున్నప్పుడు ఆమె రోడ్డుమధ్యకు పరుగెత్తుకెళ్ళి వచ్చేవచ్చే జర్మన్ సైనికులతో నిండిన మోటారుట్రక్కుపై ఒక చేతిబాంబును విసిరిందని చెప్పాడు.

టోస్యా ఆదళంతోనే వుండిపోయింది. గస్తీదారుగా తన శక్తి సామర్థ్యాలను రుజువుచేసుకుంది. అనేకసార్లు జర్మన్లచేత ఆక్రమించబడిన గ్రామాల్లో ప్రవేశించి తమకు కావలసిన రహస్యాలను సంపాదించుకొచ్చేది. ఆమె తన విశ్రాంతిసమయంలో తన సోదరసైనికుల బట్ట లుతికిపెట్టేది. మేజోళ్ళను కుట్టి పెట్టేది. అన్నంకూడా వండిపెట్టేది "మాబంగారుతల్లి" అని ఆప్యాయంగా పిలిచే వారా దళంవారంతా ఆ బాలికను. ఈబాలిక వీరకృత్యాలను గురించి ఆ జిల్లాఅంతా తెలిసింది. జర్మనీవాళ్ళు ఆమెను ప్రాణంతోగాని, చంపిగాని పట్టి యిచ్చినవారికి 10,000 రూబుళ్ళు బహుమానం యిస్తామని ప్రకటించారు. ఒకరోజున జర్మన్లు ఆమెను పట్టుకోగల్గారు. కాని ఆమె చాకచక్యంతో తప్పించుకుని అత్యంతప్రాముఖ్యమైన భోగట్టాతో తన దళాన్ని చేరుకుంది.

ఒకనాటిరాత్రి శత్రువులజాడలు తెలుసుకురావటానికి అంతా వెళ్ళారు. టోస్యా, యింకోగస్తీ తిరిగే కుర్రవాడు మాత్రమే మకాంలో నున్నారు. చీకటి గాఢంగా వుంది. ఆకాశమంతా నల్లటి మబ్బులతో నిండివుంది. వర్షం జోరుగా కురుస్తోంది. అకస్మాత్తుగా చెట్టుకొమ్మ విరిగిన చప్పుడయింది. టోస్యా వెంటనే వారు వేసుకుంటున్న మంటను ఆర్పివేసింది. చెట్లమధ్యనుండి తమవైపు నడిచి వచ్చే నల్లటి విగ్రహాల్ని చూచింది టోస్యా. గస్తీ తిరుగుతున్న కుర్రవాడు నిజంగా చూడలేదన్నమాట! లేకపోతే అతడెందుకు హెచ్చరించివుండడు! తమవైపుకు వస్తున్న జర్మన్లమీదికి ఒక చేతిబాంబును తన శక్తికొలదీ విసిరింది. చాలామంది చచ్చారు. కాని మిగతావాళ్ళు కేకలువేస్తూ, ఆమెపైకొచ్చారు. "లొంగిపో" అని అరుస్తున్నారు. టోస్యా ఒక చెట్టుచాటున నక్కి పిస్తలు పైకి లేపి కాల్చింది. ఒకజర్మన్సైనికుని తలలోనుండి దూసుకుపోయిందా అగ్నిగోళం. అతడు ప్రాణంవిడిచాడు. మరోసైనికుడు వెనుకవైపునుండి ఆమెను పట్టుకోడానికి ప్రయత్నించాడు. ఎలాగో ప్రయత్నించి అతని పొట్టకు గురిచేసికాల్చింది టోస్యా.

అదేసమయంలో "నేను లొంగిపోతున్నాను. నన్ను చంపొద్దు" అనే వణుకుతున్న గొంతు టోస్యాకు వినిపించింది. ఆమె ఆ శబ్దమువచ్చే వైపుకు తిరిగింది. చేతులు పైకెత్తి, జర్మన్లవైపుకు ఆ కాపలాకాచే కుర్రాడు వెళ్ళటం చూచింది.

ఇదివరలోకూడా అతని చర్య లీమెకు సంతృప్తికరములుగాలేవు. అతనెప్పుడూ భయపడుతూనే ఉండేవాడు. అందుచేత అతన్ని ఇంటికి పంపివేద్దామని కూడా అనుకున్నారా దళంవారు. ఆ కుర్రవాడిప్పుడు జర్మన్లకు లొంగిపోవటం చూచేసరికి అతనంటే అసహ్యం కలిగింది. "ఇదిగో రా! ద్రోహీ!" అని గర్జిస్తూ గురిచూచి కాల్చింది. వెంటనే ఆ ద్రోహి క్రిందపడ్డాడు.

జర్మన్లు టోస్యాను చుట్టుముట్టారు. తప్పించుకోటానికి ఏ మాత్రం అవకాశం లేకపోయింది. టోస్యా తనపిస్టలును తనకే గురిచేసుకుని గుండెల్లో కాల్చుకుంది.

సోవియట్ ప్రభుత్వం ఏంటోనియా పెట్రోవా (టోస్యా)కు "సోవియట్ యూనియన్ వీరయువతి" అనే బిరుదాన్నిచ్చి గౌరవించింది ఆమె మరణానంతరం. నాజీ దాస్యబంధనాలను త్రెంచుకొన్నాక "లూగా" పురవాసులు ఆమె ధైర్యకృత్యాలను స్మరిస్తూ ఒకానొకరోజున స్మారకచిహ్నం నిర్మించుతారు.

• • • •

యువక గెరిల్లాయోధులు వీరులవలె పోరాడతారు. పట్టుపడినప్పుడుకూడా వారి వీరత్వం మొక్కవోదు.

ఒకరోజున "గ్డోవ్స్క్" జిల్లాలో "స్మీనా" అనే సమిష్టివ్యవసాయక్షేత్రంలో జర్మనీవాళ్లు ప్రవేశించి పదముగ్గురు బాలబాలికలను బందీలుగా పట్టుకున్నారు. వీరిని సమీపారణ్యాలలోకి తీసుకువెళ్ళి గెరిల్లాల జాడలు చెప్పమని హింసించడం ప్రారంభించారు. కాని లాభంలేకపోయింది. అప్పుడు జర్మనీవాళ్ళు బాలబాలికలను "గ్డోవ్" అనే పట్టణానికి తీసుకువెళ్లారు. అక్కడ జర్మన్ అధికారి ఆ పదముగ్గుర్నీ బహిరంగంగా కాల్చవలసిందనీ, ఆ సమయానికి ఆ ప్రదేశంలోని ప్రజలందరిని నిర్బంధించి హాజరుపెట్టాలని ఆజ్ఞాపించాడు తన సైనికులకు. ఆబాలవీరులు సగర్వముగా మృత్యుముఖాన నిలబడ్డారు. కాల్చబోయేముందు జర్మన్లు బాలవీరుల్ని గెరిల్లాలను గురించి చెప్పమనీ, చెబితే వదలిపెడతామనీ మెత్తనిమాటలు చెప్పారు. అచంచలంగా ఆ వీరులు నిలబడ్డారు. వెంటనే అందులో పదిమందిని కాల్చివేశారు జర్మన్లు.

ఇక ముగ్గురు బాలికలు మిగిలారు.

మళ్ళీ జర్మన్లు గెరిల్లాలను గురించిన విషయాలు చెప్పమనీ, తాము జర్మన్లను విధేయతగా కొలుస్తామని బహిరంగంగా ప్రకటించమనీ నిర్బంధించ ప్రారంభించారు. అలాచేస్తే విడిచిపెడతామన్నారు. ఆ బాలికలతో "మీరు చిన్నవాళ్ళమ్మాయిలు! ఇంకా మీ భావి ఎంతో ఉంది మీ ముందు" అని బుజ్జగించటం ప్రారంభించారు.

కాని ఆ బాలికలు సమాధానంగా, అసహ్యం, అసంతృప్తి, సూచకంగా ఒక చిరునవ్వునవ్వారు. అవమానకరమైన బ్రదుకుకంటె చావేమేలు. చుట్టూ మూగిన ప్రజలవంక తిరిగి ఒక బాలిక ఇలా అంది.

కామ్రేడ్స్, మేము మా బొందిలో ప్రాణం ఉన్నంతవరకు, దేశాన్ని ప్రేమిస్తూనే ఉంటాము. మేము మాతృదేశానికి ద్రోహంచేయం మృత్యు సాన్నిధ్యంలో నిలబడి, విజయం మనదే అని చెబుతున్నాం." అచ్చటి ప్రజల హృదయాలలో ఈ మాటలు గాఢంగా నాటుకొన్నాయి. జర్మన్ అధికారి "కాల్చండి" అని కేక వేయడంతోను, తుపాకిగుండ్ల ప్రేలుడుధ్వనితోనూ ఆ బాలికల మాటలు మరి వినబడలేదు.

లెనిన్‌గ్రాడ్ బాలికలు

ఈ క్రింది వుత్తరాన్ని లెనిన్‌గ్రాడ్‌లోని తమ మిత్రులకు, యుద్ధరంగానికి వైద్యదళంతోపాటు వెళ్ళిన యిద్దరు బాలికలు "లిడియా ఉక్‌హటోవా" "పేరిదా అటకరోవా" అనేవారు వ్రాశారు.

"నేడొక సుదినం, కామ్రేడ్స్ మేము యుద్ధరంగమునుండి ఈ ఉత్తరాన్ని వ్రాస్తున్నాం. మేము మిమ్ము వదలి వెళ్ళినప్పటినుంచి అనేక నూతన ప్రదేశాలలో ప్రయాణం చేశాం. ఎన్నో అపాయాలను ఎదుర్కొన్నాం. మన సోదరీమణులు యుద్ధరంగంలో చూపిన ధైర్యసాహసాలను వర్ణించటానికి మాటలు చాలవు.

మొదటిసారి మేమంతా కలిసే యుద్ధరంగానికి వెళ్ళేం. మంటలు మండుతున్న ఒక అరణ్యంగుండా, తుపాకిగుండ్ల వర్షంక్రింద నేలమీద పాకుతూ వెళ్ళవలసివచ్చింది. కాని మా మనస్సులోవున్న ఆలోచన ఒకే ఒకటి, అది వీలైనంత త్వరగా యుద్ధభూమిలో గాయపడిన సైనికులను దూరంగా తీసుకుపోవడమే. అపాయం విషయమై ఎవడూ ఆలోచించలేదు.

మన సైన్యాధికారులు, సైనికులు ధైర్యంగా యుద్ధం చేయడంచూస్తే మన సంగతే మనకు గుర్తువుండదు. మనరెడ్‌ఆర్మీ ఎటువంటిసాహసంతో ప్రతి అంగుళపు భూమిని కాపాడుతోందో చూస్తే; చావంటే భయమే వుండదు.

"మనవాళ్ళంతా ఉత్సాహంగాను, నిశ్చింతగాను ఉన్నారు. అమోఘంగా పనిచేస్తున్నారు. మాలో యిద్దరు మరణించారు. "అన్యాషివరీవా" "అన్యాపప్లోవా" వీరిద్దరు యుద్ధరంగంలో గాయపడిన సైనికులకు చికిత్సచేస్తూ మరణించారు.

మనవాళ్ళు చాలమంది "టోస్యాటార్‌చెంకో"తో సహా ఒక అరణ్యమధ్యంలో కొంతమంది గాయపడిన సైనికులనువెదకి, గుర్తుపట్టి, మన సైన్యాలవద్దకు తీసుకురావటానికి ప్రయత్నించారు. కాని దారిమరచిపోయి మూడు రోజులవరకూ ఆ అరణ్యంలోనే అటూఇటూ తిరిగారు. ఆ మూడురోజులూ వాళ్ళంతాపస్తే. వాళ్లకు కొన్ని బెర్రీ పళ్ళుమాత్రం దొరికాయి. కాని ఆ పళ్ళను గాయపడ్డ ఆ సైనికులకే

తినిపించారు.. చివరకు మన యుద్ధభూమిలోనున్న ఆసుపత్రికి తీసుకురాగలిగారు. వారు ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు.

"మొత్తంమీద ప్రతి సోవియట్‌బాలిక నెరవేర్చే కర్తవ్యాన్నే మేమూ నెరవేరుస్తున్నాం".

యుద్ధం ప్రారంభమయిన వెంటనే వేలకువేలుగా లెనిన్‌గ్రాడ్ బాలికలు, రెడ్‌క్రాస్ (వైద్యదళం) లోచేరి తమను వెంటనే యుద్ధభూమికి పంపించమని దరఖాస్తులు పెట్టుకున్నారు. ఒక ఫ్యాక్టరీలో పనిచేసే "నాద్యా ఐవనోవా" అనే ఆమె పెట్టుకున్న ఈక్రింది దరఖాస్తును ఉదహరిస్తున్నాను.

"నన్ను వైద్యదళంతోపాటు, యుద్ధరంగానికి వీలైనంతత్వరలో పంపించండి. నేను ఫిన్నిష్ యుద్ధసమయంలో ఒక ఆసుపత్రిలో పనిచేశాను. అప్పుడు గాయపడిన ఎఱ్ఱసైనికులకు నా రక్తాన్నికూడా దానంచేశాను. నేనిప్పుడు నాదేశాన్ని జర్మను ఫేసిస్టులనుండి రక్షించటంకోసం యుద్ధరంగానికి వెళ్ళాలి."

"వీరావిస్కునోవా" అనే బా[illegible] ఇంకొక దరఖాస్తును పెట్టుకుంది. ఆమె తన దరఖాస్తులో తన ముగ్గురు అన్నలూ - ఒకరు విమానవ్యతిరేక శతఘ్నుల దళంలోనూ, ఇంకొకరు వైమానికుడుగానూ, మూడవ సోదరుడు టాంకుదళాలలో పనిచేస్తూనూ, యుద్ధభూమికి వెళ్ళారనీ, తన భర్తకూడా వైమానికుడుగా పనిచేస్తున్నాడనీ వ్రాసింది. తానుకూడా వారి అడుగుజాడల్లోనే పోవాలనీ, అకారణంచే తనను ఎఱ్ఱసైన్యంలో జేర్చుకోవలసిందనీ కోరింది. ఈమె దరఖాస్తు మంజూరు చేయబడింది.

ఈక్రింది భోగట్టా యుద్ధభూమిలో యువతీ యువకుల మనః ప్రవృత్తిని రుజువుచేస్తుంది.

"వీరాఖెర్‌టిలోవా" అనే బాలిక లెనిన్‌గ్రాడ్‌లోని "స్కొరోకోద్" యుద్ధానికి పూర్వం చెప్పుల మిల్లులో పనిచేసేది. ఒకరోజున యుద్ధభూమినుండి ఆరోగ్యం సరిగా లేకపోయినకారణంచేత సెలవుమీదవచ్చి తాను యిదివరకు పనిచేసిన మిల్లులో తన స్నేహితులను చూడటానికి వెళ్ళింది. మధ్యాహ్నభోజన సమయంలో ఒక చిన్న సమావేశాన్నేర్పాటుచేశారు. ఆసమయంలో ఆమె తన అనుభవాలను గురించి చెప్పింది. ఆ సభికులలోనుండి ఒకరు అడిగారు. "అగ్నివర్షం కురుస్తున్నా, లెక్కచేయక నీవెంతమంది గాయపడిన సైనికులను సురక్షిత స్థానాలకు చేర్చావు ?" అని. "ఒక వందకుపైగా" అని ఆమె సమాధానం యిచ్చింది.

ఈ సమాధానం సభికుల హర్షధ్వనులకు పాత్రమయింది. ఆ కార్మికులంతా తమ స్నేహితురాలు చేసినసేవకు గర్వపడ్డారు. ఒక ముసలికార్మికుడు వేదిక నెక్కి "వీరా"ను కౌగలించుకుని ముద్దుపెట్టుకుంటూ "నీవు నిజంగా లెనిన్‌గ్రాడ్ యువతివి" నువ్వు "స్కొరొకోద్" మిల్లుకు చెందినదానివని ప్రతివాడూ గుర్తిస్తాడు" అన్నాడు.

"వీరా" యుద్ధభూమిలో జరిగిన ఒక ఘట్టాన్ని గురించి చెప్పిందికాదు. సిగ్గుపడింది దానిని మరొకరు చెప్పారు.

ఒకరోజున "వీరా" పనిచేసే దళానికి, జర్మన్లకు తీవ్రయుద్ధం జరుగుతోంది. జర్మన్లదే పైచేయిగా వున్నట్లు కనబడింది. వారి నాపడం ఎవరితరమూ కాదనిపిస్తోంది. యుద్ధం క్లిష్టదశలోనున్న సమయంలో దళాధిపతి గాయపడి క్రింపడిపోయాడు. ఒక నిమిషం ఎఱ్ఱసైనికులు తడబడ్డారు. ఆ సమయంలో "వీరా" లేచి నిలబడి ముందుకు పరుగెత్తి "ఛార్జ్" (ముందుకుపదండి) అని కేకవేసింది. ఎఱ్ఱసైనికులు, ఆమెనుఅనుసరించారు.

ఎఱ్ఱసైనికులు, అమితోత్సాహముతో పోరాడేసరికి జర్మన్లు తోక ఝాడించారు. మొదటిసారి ముందు కొచ్చేసరికి "వీరా"కు ఒక గుండుదెబ్బ తగిలింది. రక్తం స్రవిస్తున్నప్పటికీ "వీరా" వారికి నాయకత్వం వహించి ముందుకు సాగింది. ఆమెకు మరోగుండుదెబ్బ తగిలింది. కాని ఈ దెబ్బకూడా ఆమె పురోగమనాన్ని అరికట్టలేకపోయింది.

మూడవసారి "వీరా"కు బలమైనగాయం తగిలింది. స్పృహతప్పి పడిపోయింది వీరా. ఆమెను యుద్ధభూమినుండి అవలకు తీసుకువెళ్ళారు ఎఱ్ఱసైనికులు. "వీరా" శూరకృత్యం విజయాన్ని సాధించింది. ఎఱ్ఱసైనికదళం శత్రువును ఎదుర్కొని ఓడించి ముందుకుసాగింది. క్రొత్తస్థానాన్ని ఆక్రమించి సురక్షితంగా నిల్చింది. "వీరా"కు తగిలిన దెబ్బలు నయంకాగానే తిరిగి యుద్ధభూమిలో ప్రవేశించింది.

• • • •

"టమారాకొనొనోవ్" అనే లెనిన్‌గ్రాడ్ బాలికను గురించి ఒకానొక ఎఱ్ఱసైనిక దళాధిపతి ఈవిధంగా చెప్పాడు.

"ఎప్పుడు పోరాటం ప్రారంభమయినా 'టమారా' ముందుంటుంది". ఆదళంలోని సైనికులంతా ఆమెను "ధైర్యశాలి టమారా" అని పిలిచేవారు. ఆమె వందమంది గాయపడిన సైనికులను సురక్షితస్థానాలకు చేర్చటమేగాక వారి ఆయుధాలను కూడా చేరవేసింది వారితోపాటు. ఆయుధాలను చేరవేయడం చాల ప్రాముఖ్యం.

ఒకరోజున పోరాటం తీవ్రంగా జరిగే సమయంలో "టమారా" యుద్ధభూమిలోనుండి గాయపడిన సైనికులను మోసుకెళ్ళుతోంది. ఆమె తన సోదరుని గాయపడి నేలమీదపడిఉండటం చూచింది. అతనిని సురక్షితస్థానానికి మోసుకెళదామనుకుంది. కాని అతను "చెల్లీ నా కొట్టే ప్రమాదమైనదెబ్బ తగలలేదు! మన సైన్యాధిపతి గాయపడి అక్కడున్నాడు. అతని పరిస్థితి విషమంగాఉంది. ముందు ఆయన్ని తీసుకెళ్ళు. నేను కొంచెంసేపు ఆగుతాను అన్నాడు.

"టమారా" తన సోదరుని కోర్కెను నెరవేర్చింది. తిరిగి అన్నకోసం వచ్చింది. కాని వచ్చేటప్పటికే అన్నప్రాణం పోయింది. "టమారా" వెళ్ళివచ్చే సమయంలో ట్రెంచి మోర్టారుగుండు తగిలి మరణించాడు.

• • • •

"అన్నాపల్‌లోవా"ను లెనిన్‌గ్రాడ్ యువజనులు మరువలేరు. "వీరా ఛెర్‌టికోవా" వలెనే ఈమెకూడా సైన్యాధిపతి దెబ్బతిన్నసమయంలో నాయకత్వం వహించి పోరాటాన్ని కొనసాగించింది. ఈమె యుద్ధభూమిలో వీరవనితగా మరణించింది. ఈమె సేవల నభినందిస్తూ, సోవియట్ ప్రభుత్వం ఆమె మరణానంతరం "ఆర్డర్ ఆఫ్ లెనిన్" అనే బిరుదునిచ్చి ఆమెమూర్తిని గౌరవించింది.

అన్నా యుద్ధాన్ని గురించి డైరీలో తన అభిప్రాయాల్ని వ్రాసుకుంది. ఆ డైరీలోని కొన్ని విషయాలను చూడండి.

"నేను తరచు యుద్ధభూమికి వెళ్ళియుండటం ఎంత మంచి విషయం! అని అనుకునేదాన్ని. యుద్ధభూమంటేనే నాకదో ఆనందంగా - ఉత్సాహంగా - ఉద్రేకంగా - ఉండేది. నేనూ, నా స్నేహితులు యుద్ధభూమిలో చేసే పనికంటే విలువైన విషయం ఇంకేముంటుంది! మన పురుషులు మనకంటే ఎక్కువ కష్టాలను ఎదుర్కొంటున్నారు, మనం తగినంత పనిచేయటంలేదేమోననికూడా అనిపిస్తుంది. ముష్కర ఫాసిస్టులను మన మాతృదేశంలోనుండి వెడలగొట్టే నిమిత్తం నేనింకా ఎక్కువ పాటుపడాలని ఉంది. వాళ్ళే ఈ ఘోరాలన్నిటికీ బాధ్యులు. నేడు నా జీవితంలో ఒకేఒక ఆశయం ఉంది. శత్రుసేనలను కడసారి సైనికుని దాకా చీల్చిచెండాడడమే. ఈ విషయం ఎంత త్యాగభూయిష్ఠమైనదైనా, కష్టసాధ్యమైనా ఫరవాలేదు. యెముకలుకొరికే చలి బాధించినప్పటికీ - చలిగాలి నాముఖాన్ని పుండుపడేటట్లు చేసినప్పటికీ - ఎంతటి విపత్తువచ్చినా - బాంబులు ప్రేలుతున్నా - తుపాకిగుండ్లు మీదికురికివస్తున్నా - అగ్నిగోళాలు చుట్టుముట్టినా - నేను యుద్ధభూమిని విడువను."

"నేను తరచు నాదేశ భవిష్యత్తునుగురించి ఆలోచిస్తాను. నేనూ నాదేశం ఒకటే - నాదేశం బాగా వుంటే నేనూ బాగావున్నట్లే. శత్రువుల బాంబులు లెనిన్‌గ్రాడ్ నగరంలో ప్రేలుతూ, గ్రంథాలయాలనూ, సుందర భవనాలను, యిండ్లనూ, దగ్ధంచేసేటప్పుడు - నేను జర్మన్లు నాగుండెను గురిచేసి కాలుస్తున్నట్లే భావిస్తాను. నా హృదయం "ధైర్యంగా ఉండు నమ్మకంగా పోరాడు. వీరులప్రక్కన నిలబడు" అని ఘోషిస్తుంది........"

• • • •

వేలకొలది లెనిన్‌గ్రాడ్ విశ్వవిద్యాలయపు, సెకండరీపాఠశాలల బాలికలు, సైనికుల వైద్యాలయాలలో పనిచేస్తూ, గాయపడిన సైనికులను సాకుతూ, ఆసుపత్రులను ఊడుస్తూ, సైనికుల గుడ్డలను శుభ్రంచేస్తూ, సైనికుల బాధ నివారణకు

శక్తివంచనలేకుండా పాటుపడుతూ, సైనికులకు స్వస్థత చేకూరేనిమిత్తం సేవ చేస్తున్నారు.

లెనిన్‌గ్రాడ్‌నగరంలో, విమాన వ్యతిరేక శతఘ్నిదళాలు, అగ్నిమాపక దళాలు, పౌరరక్షణదళాలు, అచ్చుగా బాలికలచేతనే నడుపబడుతున్నవి కొన్ని ఉన్నాయి.

వేలకొలది లెనిన్‌గ్రాడ్ బాలికలు మిలిటరీ శిక్షణవర్గాలలో చేరి తుపాకిని కాల్చటం, మరతుపాకుల్ని ఉపయోగించటం, విమాన వ్యతిరేక శతఘ్నులను ప్రేల్చటం, ట్రెంచిమోర్టార్‌ను ఉపయోగించడం నేర్చుకున్నారు. టెలిగ్రాఫ్, టెలిఫోన్ ఆపరేటర్లుగాను, మోటారు డ్రైవర్లుగాను తయారయ్యారు.

లెనిన్‌గ్రాడ్ బాలికలు నగరంచుట్టూ రక్షణస్థానాలను నిర్మించటానికి, అరణ్యాలలోకి వెళ్ళి చెట్లను కొట్టటంలోనూ, రోడ్లను వేయటంలోనూ, చెడిపోయిన వంతెనలను బాగుచేయటంలోనూ, ప్రముఖపాత్రను నిర్వహించారు.

గాయపడిన సైనికుల ప్రాణం నిల్పి త్వరలో వారు కోల్కొడానికిగాను తమ రక్తాన్ని దానంచేసిన బాలికల సంఖ్య లెనిన్‌గ్రాడ్‌లో వేలమీదవుంది.

ఈ బాలికలు తమరక్తాన్ని విరివిగా దానంచేశారు. "అలెగ్జాండ్రానొసోవీ" అనే ఆమె ఒక రైల్వేఎలెక్ట్రిక్ నిపుణురాలు. యుద్ధంప్రారంభమైన దగ్గర నుంచీ అయిదు క్వార్టు (Quatrs)ల రక్తాన్ని దానంచేసింది.

గత శీతాకాలంలో లెనిన్‌గ్రాడ్ వున్నపరిస్థితులలో ఈ త్యాగాలకు అర్థం ఏమిటి? అని ఆలోచించాలి. అపుడు లెనిన్‌గ్రాడ్ దిగ్బంధం చేయబడివుంది. లెనిన్‌గ్రాడ్ పౌరులు ఆకలిబాధతో అల్లాడుతున్నారు. చలికి ముద్దయిపోతున్నారు. నిరంతరం నేలమీదనుంచీ, గాలిలోనుంచీ బాంబులవర్షం కురుస్తోంది.

ఎంతో తీవ్రంగా కష్టపడి పనిచేస్తున్నారు. ఇలాంటిస్థితిలో రక్తదానంచేయట మంటే మరింత శారీరకంగా బలహీనపడటం అన్నమాట. అయినా ఆ బాలిక దానంచేసింది. ఇలా ఈ బాలికలు, యుద్ధభూమిలో యుద్ధం చేస్తున్నవారికంటె, ఆత్మ బలిదానంలో గాని, వీరత్వంలోగాని, ఏమాత్రమూ తగ్గకుండా, రక్తత్యాగం చేస్తున్నారు.

బాలబాలికలు

నేటియుద్ధంలో లెనిన్‌గ్రాడ్ యువజనుల వీరకృత్యాలను గురించి చెప్పే టప్పుడు లెనిన్‌గ్రాడ్‌లోని బాలబాలికలను మరచిపోతే అది అసంపూర్తేఅవుతుంది.

ఉదాహరణకు "కోల్యాలెవరెంట్యీవ్" ఉన్నాడు. అతనిని లెనిన్‌గ్రాడ్‌లోని పిల్లలంతా ఎరుగుదురు. వారంతా ఇతనినిగూర్చి ఆశ్చర్యంగా చెప్పుతుంటారు. ఇతడు వారందరికీ ఆదర్శబాలుడు. "ల్యూగా" గెరిల్లాదళంలో "కంటికి కనపడని గస్తీదారుడ"ని ఆ బాలికలంతా ఎరుగుదురు. అతడు "ల్యూగా" జిల్లాలోని జర్మన్ ఆక్రమిత ప్రదేశాలలో చొరబడి జర్మన్లను గూర్చిన భోగట్టాను సంపాదించుకొచ్చేవాడు.

ఒకరోజున జర్మన్లు "కోల్యా"ను పట్టుకున్నారు జర్మన్లు అతనిని గెరిల్లా దళసభ్యుడనుకోలేదు. "కోల్యా" అన్న గెరిల్లా అని వాళ్ళకుతెలుసు. అందుచేత ఇతనిద్వారా ఆ గెరిల్లాదళాన్ని గురించి తెలుసుకోవచ్చనుకున్నారు.

"గెరిల్లాలు ఎక్కడున్నారో చెప్పు? మమ్మందరినీ వాళ్లున్నచోటుకు తీసుకు వెళ్ళు. నిన్ను వదలిపెడతాం" అని జర్మన్ అధికారి అడిగాడు.

కోల్యాకు చావంటే ఇష్టంలేకపోయినా, పళ్ళుబిగించి నిశ్శబ్దంగా ఊరు కున్నాడు. "మాట్లాడతావా? లేదా?" అని జర్మన్లు గద్దించారు. సమాధానంలేదు! ఫాసిస్టు కిరాతకులు అతని ముక్కూ చెవులూ కోసివేశారు. "కోల్యా" మూలగ కుండా ఉండలేకపోయాడు. కాని ఇతరంగా ద్రోహకరమైన మాటలేవీ అతని నోటివెంట రాలేదు.

ఈ చిత్రవధ కొంతవరకు సాగింది. కాని "కోల్యా" మాట్లాడడు. విసుగు చెంది, జర్మనీవాళ్ళు "కోల్యా"ను బయనెట్లతో పొడిచి చంపారు.

• • • •

కోల్యా సహనం, దేశభక్తి "ఫిద్యాపొలికరపోవ్"కు ఉత్సాహోద్రేకాలను కలిగిస్తాయి. తాను కష్టసమయంలో అతనిని జ్ఞప్తికి తెచ్చుకొనేవాడు. "ఫిద్యా" తల్లిదండ్రులు ఫాసిస్టులచేత చిత్రవధ గావింపబడ్డారు. ఫిద్యా కసిదీర్చుకుంటానని ప్రతిజ్ఞచేశాడు. "కోల్యాలావ్ రెన్‌ట్యీవ్" వలెనే ఫిద్యా తరచు నాజీశ్రేణులలోనికి జొరబడి రెడ్‌ఆర్మీ కుపయోగించే విలువైన సమాచారం తెలుసుకొననిదే బయటికి రాడు.

• • • •

"టోల్యావాల్‌కోవ్" "యూరీదెనిసోవ్" "లీషావినోగ్రదోవ్" "లీవాఆనో విస్కీ" మొదలైన బడిపిల్లలెందరో నగరంలో జాగ్రత్తగా తిరుగుతూ, నాజీ ఏజంట్లను, గూఢచారులను, పసిగడతారు. అనేక జర్మన్ గూఢచారులను పట్టు కొన్నారు.

లెనిన్‌గ్రాడ్‌లో బడిపిల్లలు మంటల బాంబులను చురుకుగా ఆర్పివేసి అగ్ని ప్రమాదాలను చాలవరకుతగ్గిస్తారు. చాలామంది తమకున్న ఏళ్ళసంఖ్య (వయస్సు) కంటె ఎక్కువ బాంబుల్ని ఆర్పివేశారు. ఉదాహరణకు "ఒలెగ్‌పెగోవ్" ను తీసుకుందాం. అతను తొమ్మిదేళ్ళవాలుడు. పదిహేను మంటలబాంబుల్ని ఆర్పి వేశాడు. "గెన్యాటాల్‌స్టాయి" అనే పన్నెండేళ్ళబాలుడు 19 బాంబుల్ని ఆర్పి వేశాడు. "కొల్యా ఏండ్రియాష్" ఇంకా ఇద్దరిస్నేహితులతోకలసి (వారివయస్సు పది సంవత్సరాలే) 43 బాంబుల్ని ఆర్పివేశాడు.

ఈ మంటలబాంబుల్ని "సిగరెట్టు కాల్చుకునే మంటలు" అనే హుషారుగా అంటారు లెనిన్‌గ్రాడ్ బాలబాలికలు.

లెనిన్‌గ్రాడ్ బాలికలు తాము ఉండేఇళ్ళను, విద్యనభ్యసించే పాఠశాలలను జూచి, వాటిని కాపాడుటలో సహాయపడ్డామని గర్వపడతారు.

"మీషాలెవ్‌షీవ్" "బోరిస్‌కొన్‌డ్రట్యావ్", "వన్యాసొరోకిన్", వీరంతా 20 వ నెంబరు స్కూలు విద్యార్థులు. ఒకరోజున వీరు తమస్కూలుపై వేయబడిన 16 మంటలబాంబుల్ని ఆర్పివేశారు. ఇంకో విమానదాడిసమయంలో ఫ్రూంజ్ ప్రాంతంలో వేయబడిన నాల్గు మంటలబాంబుల్ని ఆర్పివేశారు. అందులో ఒకటి సరిగా ఆరలేదు.

మరునాడుదయం అందులోనుంచి మంటలు బయలుదేరినాయి. ఆ చిన్న పిల్లలక్కడకు ముందు పరుగెత్తి మంటల్ని ఆర్పివేశారు.

ధైర్యంలోనూ, సహనంలోనూ, బాలురకు బాలికలేమాత్రం తీసిపోవటం లేదు. ఒక విమానదాడి సందర్భంలో "వాల్యాబొరోవస్కయా" అనే 11 ఏళ్ళ బాలికకు దెబ్బతగిలింది. కాని ఆసుపత్రికి వెళ్ళడానికి ఇష్టపడలేదు. తనకంటే తీవ్రంగా గాయపడినవారికి సహాయపడటానికి ఉండాలని పట్టుబట్టింది.

బడిపిల్లలు, యుద్ధరంగానికివెళ్ళిన సైనికుల కుటుంబాలకు చాల ఎక్కువగా సహాయపడ్డారు. అలాంటి కుటుంబాలలోని పసిపిల్లలను ఆడిస్తారు. బజారుకు తీసుకెళ్ళతారు. విమానదాడులు జరిగే సమయాలలో "రక్షణస్థానాలకు చేరుస్తారు. లెనిన్‌గ్రాడ్ బాలికలు జబ్బుగాఉన్నవారికి, ముసలివారికి నీళ్ళు అందిస్తారు. కట్టెలు కొట్టిపెడతారు. యుద్ధంలో గాయపడి ఆసుపత్రులలో చికిత్సపొందే సైనికులకు, పుస్తకాలు సంపాదించిపెడతారు. ఉత్తరాలు వ్రాయడంలో సహాయపడతారు. వేడినిగలిగించే దుస్తులను, ఇంకా ఇతర బహుమానాలను తీసుకొస్తారు సైనికులకు.

లెనిన్‌గ్రాడ్ బాలబాలికలు నగరంలో చిన్నచిన్న లోహపుముక్కల్ని ఏరు కొస్తారు. కాలినిన్‌జిల్లాలోని 404 నెం. స్కూలుపిల్లలు ఒక్కరోజులో టన్ను న్నర లోహాన్ని ప్రోగుచేశారు. ఫ్రూంజ్ జిల్లాలోని పిల్లలు పదిటన్నుల వుక్కను ప్రోగుచేశారు. పుష్కిన్ జిల్లాలోని బాలబాలికలు పదిటన్నులకు పైగా లోహాన్ని ప్రోగుచేశారు.

ద్రావకాన్ని పోసిన సీసాల నుపయోగించి వీరసైనికులు శత్రువులను చీకాకుపరుస్తారు. ఈ పనికి ఖాళీసీసాలు బాగా ఉపయోగపడతాయి.

లెనిన్‌గ్రాడ్‌లోని బాలబాలికలు తమ యిళ్ళనన్నిటిని గాలించి, యిరుగు పొరుగువారి సీసాలుకూడా సేకరించి కొద్దికాలంలోనే పదిలక్షల సీసాలు ప్రోగు చేశారు.

అత్యంత క్లిష్టపరిస్థితులలోకూడా తాము వీర లెనిన్‌గ్రాడ్ పౌరసత్వహక్కునకు అర్హులమని రుజువుచేసుకున్నారు లెనిన్‌గ్రాడ్ బాలబాలికలు.

ఫ్యాక్టరీలో

ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికస్త్రీల త్యాగమూ, ధైర్యమూ, యువకుల ధైర్యసాహసాల కేమాత్రం తీసిపోవడంలేదు. వైమానికులు, ఫిరంగిదళాలు నగరంమీద బాంబులను వేస్తున్నప్పటికీ, లెనిన్‌గ్రాడ్‌చుట్టు ముట్టడింపబడడంవల్ల కలిగిన అనేక కష్టా లున్నప్పటికీ, లెనిన్‌గ్రాడ్ కార్మికులు భీతావహులుగాక, రణరంగంలోని సైనికుల వుపయోగంకోసం మందుగుండుసామగ్రిని, ఆయుధాలను తయారుచేస్తూ, యంత్రాలను జోరుగా పనిచేయిస్తున్నారు. ఉత్పత్తిని ఏమాత్రం కుంటుపడనీయక పోవటమేగాక రెట్టించిన ఉత్సాహంతో పనిచేశారు. పూర్వం కంటె రెట్టింపు, మూడురెట్లు, యింకా ఎన్నోరెట్లు ఉత్పత్తిని అభివృద్ధిచెయ్యాలి, అనేకోర్కె, ఒక్కటే వారిమనస్సులో వుంది.

ఉదాహరణకు, "టట్యానా బకూలినా" అనే ఆమె, ఒక ఫ్యాక్టరీలో తనిఖీదారుగా పనిచేసేది. యుద్ధం ప్రారంభంకాగానే ఆమె బాల్యమిత్రుడు "వాలోద్యా ఛెపుర్నికా" (స్టాకోనోవ్ వుద్యమసభ్యుడు) తనంతట తానే రెడ్ ఆర్మీలో చేరాడు. మరునాడు యంత్రందగ్గర అతని స్థానాన్ని ఆక్రమించింది "టాట్యానా". ఆమె నూతన స్థానంలో, ఆ క్రొత్తపనిలో నిపుణత్వాన్ని సంపాదించటానికి రేయింబవళ్ళు ఫ్యాక్టరీలోనే కాలం గడిపింది. యంత్రాన్ని నడపటంలో ప్రావీణ్యం సంపాదించడమేగాక రెండు యంత్రాల్ని నడిపే సామర్థ్యాన్ని సంపాదించింది. ఒక నెలరోజులు గడచిన తర్వాత ఆమె యిలా చెప్పింది. "ఛెపుర్నికా నడిపే రెండు యంత్రాలనూ నేను నడుపుతున్నాను. నేనిప్పుడు మూడోయంత్రాన్ని నడపటానికి ప్రయత్నిస్తున్నాను."

ఆమె స్నేహితులా మాటలు విని ఆశ్చర్యపడి అంతటి ప్రావీణ్యాన్ని సంపాదించిందో లేదో తెలుసుకోవాలని ప్రశ్నించారు. దాని కామె "అలా పనిచేస్తోంది తానొక్కతేకాదనీ, యుద్ధం ప్రారంభమయినాక అంతా అలాగే పనిచేస్తున్నారనీ" సమాధానం చెప్పింది.

ఇది ముమ్మాటికి నిజం. వందలకొలది, వేలకొలది యువతులు యుద్ధరంగానికి వెళ్ళిన పురుషులస్థానాలను ఆక్రమించారు. భార్యలు తమ భర్తల స్థానాలను, అక్కచెల్లెల్లు తమ అన్నదమ్ముల స్థానాలను ఆక్రమించి కార్యక్రమాన్ని యథోచితంగా కొనసాగిస్తున్నారు.

లెనిన్‌గ్రాడ్‌లోని ఒక పారిశ్రామిక కేంద్రంలోని ఒక ప్రధాన యంత్రపు గదిలో "పీటర్‌పోజ్ డిసీష్వా" "వాలంటీనా బిస్ట్రోవ్" అనే యిద్దరు చురుకైన, తెలివైన, అందరికంటె తక్కువ వయస్సుగలవాళ్ళు పనిచేస్తున్నారు. ఆయిద్దరు 15 సంవత్సరాల వయస్సువారు. యుద్ధ ప్రారంభసమయానికి వారింకా బడిలోనే ఉన్నారు. "పీటర్" తండ్రి రెడ్‌ఆర్మీలో చేరాడు. "వేలంటీనా" యొక్క తండ్రికూడా యుద్ధరంగానికి వెళ్ళాడు. వెంటనే ఈ యిద్దరుబాలురు తమ తండ్రుల స్థానాలలో వుండి పాటుపడటానికి, వారు పనిచేసే కర్మాగారానికి వెళ్ళారు. వారికొక నిపుణుడైన "మెకానిక్కు" పర్యవేక్షణక్రింద శిక్షణ యీయబడింది. వారిలో ఉండేపట్టుదల, చురుకుదనం, ఓర్పుమూలంగా కొద్దికాలంలోనే ప్రవీణులై తమ తండ్రులు చేయగలిగినంత పనిని చేయగలిగారు.

ఇలాంటి బాలురు, ఫలానాపనిని చేస్తామని చెబితే ఆపని జరిగిపోయినదన్నమాటే. సందేహంలేదు.

ఉదాహరణకు, లెనిన్‌గ్రాడ్‌లోని ఒక ఫ్యాక్టరీకి, యుద్ధరంగంనుండి అర్జంటుగా ఒక పని చేయవలసిందని, అందుకొక రోజునుకూడా నిర్ణయించిన ఉత్తర్వు అందజేయబడింది. ఆపనిని "కాసిమోవ్" "వానిగ్" "స్మిర్‌కోవ్" "కుద్ర్యషోవ్" అనే నలుగురు యువకకార్మికులకు అప్పజెప్పారు. నిర్ణీతసమయంకంటె ఒకరోజుముందే ఆపనిని చేయాలనే దీక్షతో ఆపని పూర్తయ్యేదాకా ఫ్యాక్టరీనుండి బయటికి పోకుండా పనిచేసి వాగ్దానాన్ని నెరవేర్చుచున్నారు.

"స్కారొకోద్" చెప్పులమిల్లులో పనిచేసే "గుస్సీవా" "ఐవనోవా" "జడనోవా" అనే ఈముగ్గురు యువతులూ, యుద్ధానికిపూర్వం తాముచేసే పనికి మూడు రెట్లధికంగా చేస్తున్నారు. ఒక నెలరోజులలో తోలును పొదుపుగావాడి 1500 జతల బూట్లను అదనంగా తయారుచేయటానికి సరిపడిన తోలును మిగిల్చారు. నేదు సమయం చాలవిలువైంది. కాని ముడిసరుకుకూడా అలాగే విలువైంది. ప్రతి ఫ్యాక్టరీలోనూ ఈ యువకకార్మికులు పొదుపుగా ముడిసరుకుల్ని ఉపయోగించటంద్వారా ఎంత కలసివచ్చింది అని లెక్కవేస్తే లక్షల్లోఉంటుందీసంఖ్య.

కార్మికయువకులు తక్కువకాలంలో ఎక్కువ ఉత్పత్తిని చేయటానికి కొత్తకొత్త మార్గాలను కనిపెడుతున్నారు. లెనిన్‌గ్రాడ్‌లోని ఒక ఫ్యాక్టరీలో పనిచేసే "సొకలోవ్" అనే కార్మికుడు 17 గంటల్లోచేసే పనిని 36 నిమిషాల్లోనే చేయుటకు కొత్తపద్ధతిని కనిపెట్టాడు.

ఇంకో ఫ్యాక్టరీలో "అలెగ్జాండ్రా బలాకిన్" అనే యువకుడున్నాడు. అతనికి మూడు సంవత్సరాల అనుభవం వుంది. ఒకరోజున యుద్ధభూమినుండి ఒకపనిని వెంటనే చేయవలసిందని ఉత్తర్వువచ్చింది. ఆపనిని అంతకుముందు ఆఫ్యాక్టరీలో ఎవరూ చేయలేదు. ఆ పనిని "అలెగ్జాండ్రా బలాకిన్" కిచ్చారు. ఒకరాత్రి ఒక పగలు ఏకదీక్షగా ప్రయత్నించాడు. అతడు తయారుచేసిన మొదటి శాంపిల్సు అయిదూ చాలా బలహీనంగాఉన్నాయి. అప్పుడతను తనయంత్రానికి ప్రత్యేక పద్ధతిని కనిపెట్టాడు. అప్పుడతనిపని సరిగాను, చాలత్వరగాను జరిగింది. మొదటి పదివస్తువుల్ని తయారుచేయటానికి అతనికి 36 గంటలు పట్టింది. కాని తరువాత 12 గంటల్లో 40 ముక్కల్ని తయారుచేయగల్గాడు. పనికూడా చాలా బాగుంది. ఇతర కార్మికులు "బలాకిన్"ను అనుకరించారు. ఇప్పుడు నిర్ణీతకాలంలో అనేక రెట్లు వస్తువులు తయారవుతున్నాయి.

లెనిన్‌గ్రాడ్ కార్మికులలో ప్రఖ్యాతినందిన స్టాకనోవ్‌అనుచరుడు "వ్లాడిమర్ క్న్యాజీవ్" అనే అతడున్నాడు. అతని ఫ్యాక్టరీలో ఉత్పత్తిని రెండింతలు తయారు చేసే రెండువందల మందిలోనూ ఒకడు. నేడు క్న్యాజీవ్ సామాన్య ఉత్పత్తికి పదిరెట్లు హెచ్చుగా ఉత్పత్తిచేస్తున్నాడు.

"సైన్యాలకు ఫిరంగులు ఎక్కువ కావలసివచ్చినవి గనుకనే. నేనిప్పుడు పదిరెట్లెక్కువ పనిచేయగల్గాను." అని అతడంటాడు.

నేడు అసంఖ్యాకప్రజలు మందుగుండుసామాను తయారుజేసే ఫ్యాక్టరీలలో పనిచేస్తున్నారు. ఈ వృత్తికి వారంతా కొత్తవారే. ఎర్రసైనికులభార్యలు, ఆఫీసుల్లో పనిచేసేయువతులు, బడిపిల్లలు ఈ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. వారినందరిని మొదట నిపుణులైన పనివారి పర్యవేక్షణక్రింద వుంచి తరిఫీదు నిచ్చారు. త్వరలోనే వారంతట వారే యంత్రాన్ని నడుపగలిగిన శక్తివంతులై పనిచేస్తున్నారు.

ఈ విధంగా క్రొత్తవారికి పని నేర్పిన ఉపాధ్యాయులలో "గాల్యాఐవనోవా" అనే ఆమెకూడా వుంది. యుద్ధం ప్రారంభమయినదగ్గరనుండి ఆమె తన పనిలో కూడ ఎంతో నిపుణత చూపించింది. ఒక షిఫ్టులో ఆరు వస్తువుల్ని తయారుచేసే దల్లా యిపుడు 28 వస్తువుల్ని తయారుచేస్తోంది. ఫ్యాక్టరీలోనికి క్రొత్తవారురాగానే తన ఫోర్మన్ (ముఠానాయకుడు) దగ్గరకువెళ్ళి వారిలో కొందరికి తాను పనినేర్పు తానంది.

సరే నన్నాడతను. "గాల్యాఐవనోవా" పాఠశాల అని దానికి పేరొచ్చింది.

ఈమె పర్యవేక్షణక్రింద శిక్షణపొందిన విద్యార్థులు అందరికంటె బాగా పనిచేస్తున్నారు. ఈమె చేతికింద తయారైనవారంతా "స్టకొనోవైట్" లయ్యారు.

లెనిన్‌గ్రాడ్‌లోని ఒక ఫ్యాక్టరీలో చాలా వస్తువుల్ని యుద్ధరంగానికి పంపవలసి వచ్చింది ఒకసారి. రవాణాశాఖలో పనిచేసేవారు 15 మంది ఆపనిని చాలా శ్రద్ధతోచేస్తే బండ్లకెక్కించడానికి కనీసం ఒకరోజన్నా పడుతుందన్నారు.

ఈ పని చేసేవారంతా ఇతర పనులలో నిమగ్నులయ్యారు. మరొక శాఖ లోని తొమ్మిదిమంది కుఱ్ఱవాళ్ళు తమ పనిని అప్పుడే పూర్తిచేశారు. వారికి పూర్తిగా విశ్రాంతి అవసరం. కాని వారు విశ్రాంతి తీసుకోకుండా ఈ పనికి సిద్ధమయ్యారు. 15 మంది రోజల్లా చేయవలసి వస్తుందని అంచనావేసిన పనిని మూడు గంటలలో చేశారు. ఆ వస్తువుల అవసరం యుద్ధరంగంలో అత్యధికం అని వారెరుగుదురు. అందుచే తమ సర్వశక్తులను ఉపయోగించి ఆ పనిని నెర వేర్చారు.

సరఫరాశాఖలో పనిచేసే కార్మికులు ఆశ్చర్యకరమైన పనులు చేశారు. ఒక్క ఉదాహరణ చూడండి.

ఉన్న ముగ్గురి పనివాళ్ళలోనూ ఇద్దరు యుద్ధభూమినుండి పిలుపురాగానే వెళ్ళిపోయారు. ఇక మిగిలినదల్లా "సొలోసమ్కిన్" అనే యువకార్మికుడొక్కడే. పనిజరగాలని వార్తరాగానే ఇతడొక్కడే బాయిలర్లదగ్గర పనిచేయటం ప్రారంభించి, అయిదురాత్రులు, అయిదుపగళ్ళు ఏకదీక్షగా పనిచేశాడు.

సరఫరాశాఖలో పనిచేసేయువకులు అత్యంత ప్రమాదకరమైన సమయాల్లో కూడా దీక్షతో పనిచేస్తున్నారు. "నికిటిన్" అనే ఒక యువక స్టేషన్‌మాష్టరు చేసినపనే ఇందుకు నిదర్శనం. అతని స్టేషనుపై జర్మన్లు బాంబులువేశారు. ఆసమయానికి స్టేషనులోఉన్న ఒక రైలుబండి దెబ్బతింది. కొన్నిపెట్టెలకు నిప్పంటుకుంది. ఆమండే పెట్టెలను తీసివేయడానికి రైలుబండిని వెనుకకు నడిపించాలి. కాని ఆపనివాడు (Switch man) మరణించాడు. ఆసమయంలో "నికిటిన్" మెల్లగా ప్రాకుతూ, పరుగెత్తుతూ, తుపాకిగుళ్ల వర్షంమధ్య ఆ స్విచ్ బోర్డు దగ్గరకువెళ్ళి పని పూర్తిచేశాడు.

మరొక|ఉదంతం. "వీరాయెగరోవా" అనే, మరో టెలిఫోన్‌దగ్గర పనిచేసే యువతి చేసినపని ప్రశంశకు పాత్రమయిందే.

ఆమె పనిచేసే స్టేషను సమీపంలో జర్మన్ సాయుధమోటారుదళం ఒకటి కనిపించింది. వెంటనే స్టేషను ఖాళీచేయబడింది. కాని సమీప రెడ్‌ఆర్మీదళంతో సంబంధం వుంచుకోవటానికి టెలిఫోన్ తీగెలను అలాగే వుంచాలి. అప్పుడు "వీరా" తానక్కడ వుంటానంది. ఆస్టేషను జర్మనువాళ్ళ వశమైతే, జర్మన్ల చేతిలో తాను పడితే ఎట్టి ఘోరఅవస్థలకు పాలుపడవలసివస్తుందో ఆమెకుతెలుసు. ఆమె తన స్థానంలోనే వుంది. కిటికీగుండా జర్మన్ల కదలికను గమనిస్తూ, రెడ్ ఆర్మీకి ఈ విషయాన్ని టెలిఫోన్‌లో ఎప్పటికప్పుడు చెప్పేస్తోంది. రెడ్‌ఆర్మీ ఫిరంగిదళం ఆ జర్మన్ దళాన్ని నాశనంచేసేదాకా ఆమె తన స్థానంలోనే ఉంది.

ఒక సంవత్సరం శీతాకాలంలో లెనిన్‌గ్రాడ్‌లో వంటచెరకుకొరత ఏర్పడింది. ఈ కారణంచేత కొన్ని ఫ్యాక్టరీలు ఆగిపోవలసివచ్చింది. లెనిన్‌గ్రాడ్ యువకులకు, సమీపారణ్యాలలోనికివెళ్ళి చెట్లనుకొట్టి వంటచెరకును తేవలసిందిగా ఒక విజ్ఞప్తి చేయబడింది. రెండువేలమంది లెనిన్‌గ్రాడ్ పౌరులు—ఇందులో చాలమంది

బాలికలు-ఎముకలకొరుకు మంచుతో దేహం గడ్డకట్టుకు పోతున్నప్పటికీ అరణ్యాల లోకి వెళ్ళి చెట్లనునరికీ, వంటచెరుకును సంపాదించారు. దేశభక్తి ప్రపూరితమైన హృదయాలతో పనిచేశారు. నిశ్చలమైన దేశభక్తులకు, ఎన్ని ఆటంకాలువచ్చినా నిలువజాలవు.

కొన్నికొన్ని సమయాలలో మంచు, రోడ్లమీద ఎక్కువగా నున్నప్పుడు దానిమీద వంతెన్లు కట్టటానికి కలప కావలసివచ్చేది. అట్టి సమయాలలోకూడా లెనిన్‌గ్రాడ్ యువజనులు, తమ బాధ్యతను నేరవేర్చారు.

ఒకరోజున అర్జంటుగా రెడ్‌ఆర్మీ టాంకుదళంయొక్క పురోగమనానికిగాను, ఒక వంతెన నిర్మించాలిసొచ్చింది. అప్పుడు లెనిన్‌గ్రాడ్ యువతీ యువకులు— సున్నాకంటె 40 డిగ్రీలు తక్కువ శీతోష్ణస్థితిలో * విపరీతంగా చలివేస్తున్న సమయంలో, సమీపారణ్యాలలోనికివెళ్లి చెట్లనునరికి, ఆదుంగలను తమభుజాలమీద 700 గజాలవరకు మోసుకువచ్చి నిర్ణీత ప్రదేశానికి జేర్చారు. ఆనాటి రాత్రంతా శత్రువుల అగ్నిగోళాలమధ్య పనిచేసి తెల్లవారేసరికి పని పూర్తిచేశారు. వారు 1500 దుంగలను భుజాలమీద మోశారు. వాటిమీదుగా రెడ్‌ఆర్మీ టాంకులు, నిర్విఘ్నంగా ముందుకుసాగి శత్రువును ఎదుర్కొన్నాయి.

BC

గమనిక

ఈ పుస్తకంలో పొరపాటున
15, 16, పేజీలు అచ్చు పడలేదు.
ఇది అంకెల పొరపాటేగాని,
విషయం క్రమంగానే వుంది.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA122B123
పుస్తకం పేరు	లెనిన్ గ్రాడ్ యువజనవీరులు
తారీఖు	28/10/24
ముందు అట్ట	YES
వెనుక అట్ట	YES
మొత్తం పేజీలు	31
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	CI,BCI
లేని పేజీలు	NO
తయారు చేసినది	Munisha
పేజీలు విడదీసినది	munisha
స్కాన్ చేసినది	Ch.Ramya
పరీక్ష చేసినది	KASIMBI
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good